సాక్షి ప్రకాశం

బుధవారం । 28 । ఆగస్టు । 2024



ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఒంగోలు పోలీసు కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

- 8లో..



భరాయించలేం.. బదిలీ చేయండి

కనిగిరి మండలంలో 20 మంది వీఆర్వోలు బదిలీలకు దరఖాస్తు చేస్తున్నారు. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో వీఆర్వోలను బలి చేస్తుండటంతో బదిలీ కోసం బారులు తీరారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
37.5/29

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

బీపీసీఎల్‌కు స్థలాన్ని పరిశీలించిన జేసీ



స్థలాన్ని పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ

సింగరాయకొండ: భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి కృష్ణపట్నం వరకు నిర్మిస్తున్న పైపులైనుకు అనుసంధానంగా నిర్మించే వాల్వ్‌స్టేషన్‌కు అవసరమైన స్థలాన్ని మంగళవారం మధ్యాహ్నం జేసీ గోపాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఊళ్లపాలెం రోడ్డులో బింగినపల్లి చెరువు సమీపంలో సర్వేనంబరు 470–3 లో 0.61 సెంట్ల స్థలం లో వాల్వ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు ఆర్డీవో జీ సుబ్బారెడ్డి, తహశీల్దార్ టీ రవి, డీటీ తన్నీరు వెంకటేశ్వరరావు, ఆర్ఐ ప్రవీణ్, వీఆర్‌ఓ వెంకటాద్రి, సర్వేయర్ బ్రహ్మం, సాయి పాల్గొన్నారు.

విద్యార్థినులు మరింత అప్రమత్తంగా ఉండాలి



కోల్‌కత్తా హత్యాచారంపై రూపొందించిన దృశ్యగీతాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: విద్యార్థినులు నిత్యం మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డా.ఏడుకొండలు సూచించారు. కోల్‌కత్తా జూనియర్ వైద్యురాలి హత్యాచారంపై రూపొందించిన దృశ్య గీతాన్ని మంగళవారం మెడికల్ కాలేజీ గ్యాలరీలో ఆవిష్కరించారు. నగరానికి చెందిన ప్రముఖ కవయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి ఈ గీతాన్ని రచించగా ప్రజా గాయకుడు నూకతోటి శరత్ ఆలపించిన ఆ దృశ్య గీతాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కోల్‌కత్తా వైద్యశాలలో జరిగిన ఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళనా కార్యక్రమం వలన సెంట్రల్ ప్రొటెక్షన్ ఫోర్స్ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్ల భద్రత కోసం ఒంగోలు మెడికల్ కాలేజీలో అనేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కోల్‌కత్తా ఘటనతో దేశ ప్రజలందరూ కలత చెందారని ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా.జాలాది మణిబాబు చెప్పారు. సమాజానికి ఆదర్శంగా నిలబడాల్సిన భావి వైద్యులు గంజాయి జోలికి పోవద్దని, కళాశాల ప్రాంగణంలోకి గంజాయి రాకుండా చూడాలని సూచించారు. సభకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.తిరుమలరావు అధ్యక్షత వహించగా గీత రచయిత జ్యోతిర్మయి, గాయకుడు శరత్, కవయిత్రి తేళ్ల అరుణ, మాజీ జెడ్పీటీసీ నరసమ్మ, ఎడిటర్ షాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం త్యాగాలు చేస్తే ఇదా బహుమతి



కోల్‌కత్తా ఘటనతో వైద్యులకు రక్షణ లేదన్న వాస్తవం తేటతెల్లమైంది. కనీస భద్రత లేకుండా వైద్యులు పనిచేయాల్సి వస్తోంది. మహిళా వైద్యుల భద్రత గాలిలో దీపం. దీనింతటికీ కారణం వైద్యుల రక్షణ కోసం ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురాకపోవడమే. కరోనా మహమ్మారి సమయంలో ఎంతో మంది వైద్యులు ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలు అందించారు. ప్రజారోగ్యం కోసం అనేక త్యాగాలు చేసిన, చేస్తున్న వైద్యులకు ఇచ్చే బహుమతి ఇదేనా. పాలకులు, ప్రజలు వైద్యులకు అండగా నిలబడకపోతే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎవరూ సాహసం చేయరు.

– డా.జాలాది మణిబాబు, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఒంగోలు.




ఇప్పటికైనా కళ్లు తెరవరా



నిర్భయ, దిశ ఘటనలు జరిగినా కళ్లు తెరవలేదు. దాంతో నేరస్వభావం కలిగిన వారిలో ధైర్యం పెరిగింది. ఎలాంటి నేరం చేసినా శిక్షలు పడవన్న నమ్మకం కలిగింది. అందుకే ఎక్కడ పడితే అక్కడ అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయి. కోల్‌కత్తా ఘటన దీనికి పరాకాష్ట. సభ్య సమాజం భయంతో వణికిపోయేలా నిందితులు కిరాతకానికి పాల్పడ్డారు. ఈ ఘటన జరిగి 20 రోజులు కావస్తోంది. ఇప్పటిదాకా నిందితులను పట్టుకోలేకపోయారు. ఇక నిందితులను పట్టుకుంటారన్న నమ్మకం కూడా లేదు. ఇప్పటికైనా కళ్లు తెరచి కఠిన చట్టాలు చేయాలి.

– డా.వసల ఝాన్సీ, ఐఎంఏ అధ్యక్షురాలు, ఒంగోలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాడి రైతులను ఎంతో ప్రోత్సహిస్తూ వస్తే.. చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే తన ప్రతాపాన్ని వారిపై చూపించాడు. చంద్రబాబు ఎప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసినా తన సొంత డెయిరీ హెరిటేజ్ కోసం ప్రభుత్వ డెయిరీలను నిలువునా పాతాళానికి తొక్కేస్తాడు. ప్రభుత్వ సహకార సొసైటీలకు చెందిన డెయిరీలను వాటి ఉనికిని కోల్పోయేలా తయారు చేసి ప్రైవేట్ డెయిరీలకు ఊతం ఇవ్వడం చంద్రబాబుకు 'వెన్న'తో పెట్టిన విద్య.



- నిట్టనిలువుగా దగా చేస్తున్న చంద్రబాబు
- పాడి రైతులను ఆదుకున్న వైఎస్ జగన్
- అమూల్ ద్వారా అండగా నిలిచి
- లీటరుకు రూ.85 నుంచి రూ.95 వరకు అందించిన వైనం
- టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అమూల్‌కు సహాయ నిరాకరణ
- హెరిటేజ్‌తో పాటు ప్రైవేటు డెయిరీలకు ప్రోత్సాహం
- 2019 ముందు పరిస్థితి పునరావృతం

జిల్లాలో పాడి రైతులు	3 లక్షలకు పైగా
గేదెలు	6,71,812
ఆవులు	56,332
ఏడాదికి పాల ఉత్పత్తి	81.98 కోట్ల లీటర్లు
ప్రతిరోజూ పాల ఉత్పత్తి	22.77 లక్షల లీటర్లు
ప్రతి రోజూ ప్రజల అవసరాల కోసం	13.77 లక్షల లీటర్లు
అమూల్‌తో పాటు ప్రైవేటు డెయిరీలకు	9 లక్షల లీటర్ల వరకు పాడి రైతులు పోస్తున్నారు

అమూల్ కేంద్రం మూత పడడంతో నష్టపోతున్నాం



గ్రామాల్లో అమూల్ పాల కేంద్రం మూతపడడంతో పాలకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నాను. గతంలో జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా అమూల్ పాలకేంద్రం ద్వారా మహిళల భాగస్వామ్యంతో పాలు పట్టేవారు. అమూల్ పాల కేంద్రానికి ఉదయం ఐదు లీటర్లు, సాయంత్రం నాలుగు లీటర్లు పాలు పోశాను. లీటరుకి పది శాతం ఎస్ఎన్ఎఫ్ వస్తే సుమారు రూ.85 నుంచి రూ.95 వచ్చాయి. నేడు ప్రైవేట్ డెయిరీకి పాలు పోస్తుంటే లీటరుకు రూ.75 వస్తున్నాయి. సగటున రోజుకు వంద రూపాయలు నష్టపోతున్నాను. వాళ్ల ఇష్ట ప్రకారం ధరలు అదుపు చేస్తున్నారు. అమూల్ కేంద్రం ద్వారా నెల నెలా బోనస్ కూడా పాలు పోసే వారికి ఇచ్చేవారు. నగదు చెల్లింపులు పది రోజులకు ఒకసారి క్రమం తప్పకుండా చెల్లించేవారు. మహిళలకు అమూల్ పాల కేంద్రాలు బాసటగా నిలిచాయి. మళ్లీ వాటిని ప్రారంభిస్తే పాలు పోసే వారందరికీ మేలు జరుగుతుంది.

– ఎనుముల పవనకుమారి, పాడి రైతు, పోతవరం గ్రామం, దర్శి మండలం

పాడి రైతుపై కూటమి పిడుగు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా పాడి రైతులకు పెట్టింది పేరు. వ్యవసాయం తర్వాత అతిపెద్ద రాబడిగా పాడి పరిశ్రమ విరాజిల్లుతోంది. వర్షాలు లేక ఎంత కరువు తాండవించినా గ్రామాల్లో పాడి ద్వారా రైతులు కుటుంబాలను పోషించుకుంటారు. అంతటి ప్రాధాన్యత కలిగిన పాడి రైతులను చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా నిలువునా మోసం చేయడం, దోచుకోవడం పరిపాటిగా పెట్టుకుంటూ వస్తున్నాడు. చంద్రబాబుకు రైతులన్నా.. పాడి రైతులన్నా చులకన భావమే. ఒంగోలు డెయిరీని గత చంద్రబాబు పాలనలో నిలువునా అప్పుల పాలు చేసి మూతవేసే స్థితికి తీసుకెళ్లారు. దాదాపు 40 వేల మంది పాడి రైతులు రోడ్డున పడ్డారు. ఒంగోలు డెయిరీకి ప్రతి రోజూ 1.50 లక్షల లీటర్ల వరకు జిల్లా నలుమూలల నుంచి వచ్చేవి. అలాంటిది టీడీపీకి చెందిన డెయిరీ పాలక మండలి అప్పట్లో దాదాపు రూ.100 కోట్ల వరకు దోచుకొని అప్పులపాలు చేసి డెయిరీకి తాళాలు వేశారు.

బాబు వచ్చాక ధరలు పతనం...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు పాల ధరలు, టీడీపీ ప్రభుత్వంలో ఉన్న పాల ధరలను బట్టి చూస్తే ధరలు ఏరకంగా పతనమయ్యాయో స్పష్టంగా తెలుస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2023 ఆగస్టులో రైతులకు ఇచ్చే హెరిటేజ్ పాల ధర లీటరు రూ.79 ఉంటే, అదికాస్తా ప్రస్తుతం రూ.75కు తగ్గింది. సంగం డెయిరీ కూడా హెరిటేజ్‌తో పోటీపడి మరీ తగ్గించుకుంటూ పోతోంది. సంతనూతలపాడులో సంగం పాల సేకరణ ధర 2023 ఆగస్టులో లీటరు పాల ధర (12 వెన్న శాతం) రూ.89 ఉంటే, నేడు రూ.76కు తగ్గించేసింది. ఇక కనిగిరిలో 2023 ఆగస్టులో హెరిటేజ్ పాల ధర రూ.76 ఉంటే ప్రస్తుతం రూ.73కు తగ్గింది. గిద్దలూరులో హెరిటేజ్ పాల ధర 2023 ఆగస్టులో రూ.78 ఉంటే ప్రస్తుతం రూ.72కు, కొండపిలో 2023 ఆగస్టులో రూ.76 ఉంటే ప్రస్తుతం దానిని రూ.65కు తగ్గింది. వీటి బాటలోనే జిల్లాలో మిగతా ప్రైవేటు డెయిరీలు కూడా నడుస్తూ పాడి రైతులను మాత్రం నిలువునా ముంచేస్తున్నాయి.

పాల సేకరణ కేంద్రాలపై టీడీపీ నాయకుల దౌర్జన్యాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్ కోసం టీడీపీ నాయకులు అమూల్ సంస్థ పాలు సేకరిస్తున్న కేంద్రాలపై దాడులు, దౌర్జన్యాలకు కూడా వెనకాడలేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెచ్చిపోయిన టీడీపీ నాయకులు పాల కేంద్రాల్లో చొరబడి యంత్రాలను కూడా ధ్వంసం చేశారు. వెన్న శాతం చూసే పరికరాలను ఎత్తుకు పోయారు. పాలు సేకరించే డబ్బాలను ధ్వంసం చేశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా టీడీపీ కేడర్ చేత దాడులు చేయించాడు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చే సరికి వారి ఆగడాలకు ఇక అడ్డూఅదుపూ లేకుండా పోయింది. టీడీపీ అధికారంలోకి వచ్చే సరికి అధికారులు కూడా మిన్నకుండిపోయారు. టీడీపీ నాయకులను అడ్డుకునే సాహసం చేయలేకపోయారు.

వైఎస్సార్ సీపీ పాలన పాడి రైతుకు స్వర్ణయుగం

పాడి రైతులకు చంద్రబాబు చేసిన పాపాలను తుడిచేసి పాడి రైతుల లోగిళ్లలో పాలధారలు కురిపించారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. 2019 చివరి త్రైమాసికంలో అమూల్ సంస్థను రంగంలోకి దించి పాడి రైతులకు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు. అమూల్ రాకతో ప్రైవేటు డెయిరీల్లో వణుకు మొదలైంది. అప్పటి వరకు పాల సేకరణ ధర విషయంలో ప్రైవేటు డెయిరీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించేవి. అలాంటిది అమూల్ వచ్చాక సేకరణ ధర అమాంతం పెరిగింది. జిల్లాలో అమూల్ సంస్థ గేదె పాలకు 10 వెన్న శాతం, 8 ఎస్ఎన్ఎఫ్‌కు లీటరు పాల ధరను రూ.75 తో ప్రారంభించింది. దీంతో దిక్కుతోచని స్థితిలోకి ప్రైవేటు డెయిరీలు చేరుకున్నాయి. ప్రస్తుతం లీటరు పాలకు అమూల్ సంస్థ రూ.81 వరకు ఇస్తోంది. మరో రెండు మూడు నెలల్లో రూ.84 చేరుకునేది. ఇక చేసేది లేక ప్రైవేటు డెయిరీలు కూడా పాల ధరను పెంచక తప్పలేదు. అమూల్ రాకముందు లీటరు పాల ధర కేవలం రూ.50 నుంచి రూ.55 వరకు మాత్రమే ఇచ్చేవి. అమూల్ వచ్చాక ఒక్కసారిగా రూ.60 నుంచి రూ.65 వరకు పెంచాయి. ఆవు పాల సేకరణ ధరలు సైతం పెరిగాయి. అమూల్ రూ.30 నుంచి ప్రారంభించింది. ప్రస్తుతం రూ.45 చెల్లిస్తోంది.



జగనన్న పాల వెల్లువ అమూల్ పాలకేంద్రంలో పాలు పోస్తున్న మహిళలు (ఫైల్)

అమూల్‌కు సహాయ నిరాకరణ

2024 జూన్ నెలలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్ల నుంచే పాడి రైతుపై పగపట్టాడు. అప్పటి వరకు వైఎస్ జగన్ ప్రభుత్వం అమూల్ సంస్థకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని నిలువునా కట్టడి చేశాడు. జిల్లాలో దాదాపు అమూల్ సంస్థ 300 పైగా పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పాడి రైతులకు అండగా నిలిచింది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 20 వేల లీటర్లకు పైగా పాలు నేరుగా రైతుల నుంచి సేకరిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటు కాగానే తొలగించారు. జిల్లా కేంద్రంలోని ప్రకాశం భవన్లో ఉన్న నోడల్ అధికారి కేంద్రాన్ని లేకుండా చేశారు. పాడి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని కూడా తొలగించారు. గ్రామ సచివాలయాల కార్యదర్శులను కూడా అమూల్ వ్యవహారాల్లో తలదూర్చవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.



ధర్మవరంలోని జగనన్న పాలవెల్లువ కేంద్రం

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కాలేజి విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, డ్రగ్స్ నిషేధంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ నటుడు రఘుబాబు



బైక్ ర్యాలీలో ఎస్పీ ఏఆర్.దామోదర్, సినీ నటుడు రఘుబాబు, ఏఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీధర్, పోలీస్ అధికారులు, సిబ్బంది

- మాదక ద్రవ్యాలు, ట్రాఫిక్ సమస్యలపై నిర్వహించిన అవగాహనా ర్యాలీలో ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు రఘుబాబు

ఒంగోలు టౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన ప్రముఖ సినీ నటుడు రఘుబాబుతో కలిసి నగరంలో మోటారు బైకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బయలు దేరిన ర్యాలీ మినీ స్టేడియం చేరుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్లనే ఎక్కువగా ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. తలకు గాయం కావడం వలన రక్త స్రావం జరుగుతుందని, ప్రాణాలను రక్షించే అవకాశాలు కూడా ఉండడం లేదన్నారు. దీని వలన ఎన్నో కాపురాలు కుటుంబ యజమానిని కోల్పోయి బజారున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబం కోసమైనా వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. మానసిక ఒత్తిళ్లు, చెడు స్నేహాల ప్రభావంతో కొంతమంది గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని అన్నారు. ఒకసారి డ్రగ్స్ కేసులో పోలీసులకు చిక్కి కేసులు నమోదైతే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాలు పొందలేరన్నారు. ప్రముఖ సినీ నటుడు రఘుబాబు మాట్లాడుతూ వాహనాలు నడపడం అవసరానికి ఉపయోగపడాలేకానీ ప్రాణాలు తీసేలా తయారవకూడదన్నారు. ఆరోగ్యకరమైన ఆలోచనలు, అలవాట్లు చేసుకోవాలని, ఆనందంగా జీవించాలని చెప్పారు. అంతకుముందు రఘుబాబు ఆర్టీసీ బస్టాండు వద్ద నిల్చొని వచ్చీ పోయే వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. తల మీద టోపీ ధరించి ట్రాఫిక్ వద్ద కనిపించిన నటుడు రఘుబాబును ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. కొందరు సెల్ఫీలు తీసుకున్నారు.

రోడ్డు రోలర్‌తో సైలెన్సర్ల ధ్వంసం...

ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. మోటారు వాహనాల చట్టాన్ని ఉల్లంఘించి కొందరు వాహనచోదకులు సైలెన్సర్‌ను మోడిఫైడ్ చేయించి భయంకరమైన శబ్దాలతో తిరుగుతున్న వాహనాలను పట్టుకొని సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎస్పీ సమక్షంలో ధ్వంసం చేశారు. తయారీదారులు ఇచ్చిన సైలెన్సర్లనే వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) ఎస్‌వీ శ్రీధర్ రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్ రావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, సీఐలు నాగరాజు, మేడా శ్రీనివాసరావు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు రోలర్‌తో సైలెన్సర్ల ధ్వంసం

శ్రద్ధాంజలి



జననం: 08-10-1947

మరణం: 13-08-2024

స్వర్గీయ తాటిపర్తి సుబ్బారెడ్డి గారు

స్నేహశీలి, మృధుస్వభావి, మానవత్వం కలిగిన మహనీయుడు ప్రజాసేవకుడు, రైతు హితుడు, పూజ్యనీయులైన శ్రీ తాటిపర్తి సుబ్బారెడ్డి గారు పరమపదించారని తెలియజేయుటకు ఎంతగానో చింతించుచున్నాము... వారి మరణం మాకు తీరనిలోటు.. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.....

ఇట్లు : కుటుంబసభ్యులు

పెద్దకర్మ: తేది: 29-08-2024 ఉ॥ 10 గంటలకు ఒంగోలు, భాగ్యనగర్, 3వలైనులోని మా స్వగృహం నందు జరుగును. కావున తెలియపరచడమైనది.

క్లుప్తంగా

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రులు డోలా, గొట్టిపాటి

మార్కాపురం టౌన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి హామీ ఇచ్చారు. మంగళవారం మార్కాపురం పట్టణంలోని మాధవీ గ్రాండ్ ఇన్‌లో ఏపీయూడబ్ల్యూజే విస్తృత స్థాయి సమావేశం జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఎ.సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. మంత్రులు మాట్లాడుతూ.. జర్నలిస్టులదరికీ అక్రెడిటేషన్, ఇళ్ల స్థలాల పంపిణీ, ఇన్సూరెన్స్ కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. పాజిటివ్ సమాచారాన్ని ప్రజలకు అందించే విషయంలో పాత్రికేయులు ముందుండాలని, పాలనలో లోపాలుంటే తమ దృష్టికి తేవాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తే పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఉగ్రనరసింహారెడ్డి, ఎంఎంకొండయ్య యాదవ్, టీడీపీ ఇన్‌చార్జిలు ఎరిక్షన్ బాబు, గొట్టిపాటి లక్ష్మి, దామచర్ల సత్య, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ తదితరులు ప్రసంగించారు. వివిధ పార్టీల నాయకులు ఇమ్మడి కాశీనాథ్, అందె నాసరయ్య, సోమయ్య, డీవీ కృష్ణారెడ్డి, శాసనాల వీరబ్రహ్మం, బీజేపీ నేత పీవీ కృష్ణారావు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పలువురు పాత్రికేయులను సన్మానించారు.

1న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: విశాఖపట్నంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రెనింగ్ సెంటర్‌లో ప్రవేశాలకు వాలీబాల్ యంగ్ టాలెంట్ క్రీడాకారుల ఎంపిక సెప్టెంబర్ 1న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూదనగుంట కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ పోర్టుస్టేడియంలో ఎంపిక ఉంటుందన్నారు. 16 ఏళ్ల లోపు బాల బాలికలు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఉచిత శిక్షణ, వసతితో పాటు ప్రతిరోజు పౌష్టికాహారం, స్పోర్ట్స్ కిట్, ఎక్విప్‌మెంట్, విద్యాభత్యం, టోర్నీల శిక్షణ శిబిరాలకు వెళ్లేందుకు రవాణాఛార్జీలు భరిస్తుందన్నారు. జిల్లాలోని అర్హత, ఆసక్తి ఉన్న క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగులను మోసగించేందుకే యూనిఫైడ్ పెన్షన్ స్కీం

ఒంగోలు: ఉద్యోగులను మోసం చేయడానికే యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని అఖిల భారత విద్యా సంఘాల సమాఖ్య కౌన్సిలర్ పీవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత పెన్షన్ స్కీమ్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించి మోసం చేయడానికే అని విమర్శించారు. పాత పెన్షన్ స్కీమును తప్ప ఇతర పెన్షన్ స్కీమును ఒప్పుకునేదిలేదన్నారు. ఎన్‌ఎస్‌పీ గానీ, యూపీఎస్‌గాని ప్రయోజనకరం కాదన్నారు. ఓపీఎస్ స్థానంలో ఎన్‌పీఎస్‌కు బదులుగా యూపీఎస్‌ను తీసుకురావడం దారుణమైన చర్యగా అభివర్ణించారు. పాత పెన్షన్ స్కీంను కొనసాగించకపోతే గతంలో లాగా దేశవ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపునిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



ప్రాణాలకు భరోసా ఇవ్వాలి



స్థానిక పీహెచ్‌సీ పోలీస్ స్టేషన్‌కు కొద్ది దూరంలోనే ఉంది. రాత్రి డ్యూటీలు చేయడానికి మేము వెళుతుంటాం. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒక చోటనే ఉండటం వలన సాయంత్రం అయితే ఎవరూ ఉండరు. ఒంటరిగానే ఉండటం వలన రాత్రి సమయాల్లో భయంగా ఉంటుంది. పోలీసులు రాత్రి బీట్ తిరిగే సమయంలో ఒకటి రెండు సార్లు ఆసుపత్రిని చూసి వెళితే కొంత ధైర్యంగా ఉంటుంది. ఎక్కడో ఏదో జరిగితే హడావిడి చేయడం కాదు. కోల్‌కతా ఘటన తరువాత ఎప్పుడు ఏం జరుగుతుందో అని భయం వేస్తోంది. రాత్రి సమయాల్లో పని చేసే వారికి రక్షణ కల్పించే భరోసా ఇవ్వాలి.

– స్వజి రాణి, స్టాఫ్ నర్స్, మద్దిపాడు పీహెచ్‌సీ

ప్రతి వైద్యునికి రక్షణ కల్పించాలి



వైద్యశాలల్లో పనిచేసే ప్రతి డాక్టర్‌కు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. వైద్యులు భయంతో విధులు నిర్వర్తించాలంటే సాధ్యంకాదు. ప్రధానంగా మహిళా వైద్యులకు కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వం భద్రత కల్పించాలి. కోల్‌కతా ఆర్‌జీ కార్ వైద్యశాలలో చోటుచేసుకున్న సంఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చట్టాలను పటిష్టంగా అమలు చేసినప్పుడే ఎవరైనా దాడులు చేయాలన్నా భయపడతారు.

– డాక్టర్ ఎం రాంబాబు, అసిస్టెంట్ ఆర్‌ఎంఓ, జీజీహెచ్ మార్కాపురం

భరాయించలేం.. బదిలీ చేయండి

"మండల స్థాయి సమావేశాలకు రూ.10 వేలు, డివిజన్ స్థాయికైతే రూ.50 వేలు ఖర్చు చేయాలంటే మాటలా? ఆ భారమంతా మా నెత్తిన మోపితే ఎలా బతకగలం? తప్పనిసరై ఎక్కడన్నా చేయి చాపితే ఏసీబీ కేసుల్లో అడ్డంగా ఇరికిస్తున్నారు? కూటమి నేతల బెదిరింపులు దీనికి అదనం. మా బాధ ఎవరికీ చెప్పుకోలేకపోతున్నాం. బదిలీ చేయించుకుని వెళ్లిపోవడమే శరణ్యం" ఇదీ కనిగిరి మండలంలో వీఆర్వోల మనోవేదన. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కనిగిరిలో పని చేసేందుకు ఇష్టం లేక ఏకంగా 20 మంది వీఆర్వోలు బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

- కనిగిరి మండలంలో పనిచేసేందుకు వీఆర్వోల విముఖత
- ప్రొటోకాల్‌తో చేతిచమురు వదులుతోందని ఆవేదన
- తట్టుకోలేని రీతిలో కూటమి పార్టీల నేతల ఒత్తిళ్లు
- మరోవైపు వెంటాడుతున్న ఏసీబీ భయం



కనిగిరి తహసీల్దార్ కార్యాలయం

కనిగిరి రూరల్: రెవిన్యూ డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రం కనిగిరిలో పనిచేయాలని ఓ ఉద్యోగైనా కోరుకుంటారు. జీవనశైలితోపాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండటం, సభలు, సమావేశాలు, ఇతర అవసర కోసం రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండటమే అందుకు కారణం. కానీ ఇక్కడి తాజా పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదీలీల ప్రక్రియ దరఖాస్తు గడువు మంగళవారంతో ముగియగా కనిగిరి రెవెన్యూ శాఖలో అధికారులు, ప్రధానంగా వీఆర్వోలు ఇతర నియోజకవర్గాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

25 మందిలో మిగిలేది ఒకరిద్దరే..

కనిగిరి నగర పంచాయతీతోపాటు రూరల్ మండలంలో మొత్తం 32 వీఆర్వో పోస్టులకుగాను 25 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకరిద్దరు సెలవుపై ఉండగా, మరో మూడు పోస్టుల్లో ఇన్‌చార్జిలను నియమించారు. అయితే 25 మందిలో ఒకరిద్దరు వీఆర్వోలు తప్ప 20 మందికి పైగా కనిగిరి డివిజన్, కనిగిరి నియోజకవర్గం వదిలి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో వీఆర్వోలను దోషులుగా చిత్రీకరిస్తూ బలి చేస్తున్న తీరు చూసి బదిలీ కోసం బారులుదీరారు.

ప్రొటోకాల్‌తో జేబులు ఖాళీ

కనిగిరి రెవిన్యూ డివిజన్ కేంద్రం కావడంతో నిత్యం ఏదో ఒక సమావేశం నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎవరొచ్చినా ఆ రోజు ఖర్చు మొత్తం వీఆర్వోలు భరించాల్సి వస్తోంది. కార్యాలయ స్థాయి సమావేశానికి కనీసం రూ.10 వేలు.. డివిజన్ స్థాయి సమావేశాలైతే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఆ నగదు ఇప్పించాలని ఆర్డీఓ, తహసీల్దార్లను అడగలేక, జేబులో డబ్బులు పెట్టలేక వీఆర్వోలు సతమతమవుతున్నారు.

చేతులు చాపి.. ఏసీబీ చిక్కి..

ఎన్నికలకు రెండు నెలల ముందు కనిగిరి మండలానికి చెందిన ఇద్దరు వీర్వోలు ఏసీబీకి చిక్కారు. మరో ఇద్దరు వీఆర్వోలు త్రుటిలో తప్పించుకున్నారు. వీఆర్వోలు లంచం తీసుకోవడానికి పరోక్షంగా రెవెన్యూ ఉన్నతాధికారులే కారణమన్న చర్చ ఇప్పటికీ నడుస్తోంది. ఒక నెలలోనే మూడు డివిజన్ స్థాయి సదస్సులు నిర్వహించడంతో కల్యాణ మండపం హాల్, భోజనం బిల్లులు తడిసి మోపెడయ్యాయి. నాడు సమావేశాల నిర్వహణ బాధ్యతను ఓ వీఆర్వోకు అప్పగించడంతో లంచాలకు తెరలేపాడు. ఓ రైతు వద్ద నగదు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. మరో వీఆర్వోది కూడా ఇలాంటి పరిస్థితే. అదనపు బిల్లుల భారంపై వీఆర్వోల సంఘ నాయకులు అప్పట్లోనే నిరసన తెలిపారు. తాజాగా బదిలీల నేపథ్యంలో గత సంఘటలన్నీ మరోమారు తెరపైకి వచ్చాయి.

అక్రమాలకు అంగీకరించకుంటే అంతే సంగతులు

టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన రోజు నుంచే తాము చెప్పినట్లు పనిచేయాలని టీడీపీ నేతలు హుకుం జారీ చేయడంతో రెవెన్యూ అధికారులు నివ్వెరపోయారు. మాట వినకుంటే సస్పెండ్ చేయిస్తాం, దూర ప్రాంతాలకు బదిలీ చేయిస్తామని అధికార పార్టీ నేతలు బెదిరిస్తుండటంపై కొందరు వీఆర్వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు అధికార పార్టీ నేతలు చెప్పినట్లు క్షేత్ర స్థాయిలో తప్పులు చేయలేక.. ఒకవేళ వారు చెప్పినట్లు వింటే జీవితాంతం సివిల్ కేసుల్లో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కార్యాలయాల్లో స్థిరంగా ఉండలేక మదనపడిన వీఆర్వోలు బదిలీల ప్రక్రియతో కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన వీఆర్వోలు కూడా కనిగిరికి వచ్చే పరిస్థితి లేదని ఆ సంఘ నాయకుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

బంగారమే కాదు.. సీసీ ఫుటేజ్ కూడా లేదు..

- యూనియన్ బ్యాంకులో నగలు మాయంపై రహస్యంగా విచారణ
- ఇంటి దొంగలపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన అధికారులు
- విచారణకు బ్యాంకుకు వస్తున్న ఖాతాదారులు



కనిగిరి యూనియన్ బ్యాంక్

కనిగిరి రూరల్: కనిగిరి యూనియన్ బ్యాంకులో రూ.15 లక్షల విలువైన సుమారు 220 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంగతి విదితమే. వారం రోజుల క్రితం ఓ ఖాతాదారుడు వస్తువులు తిరిగి తీసుకునే క్రమంలో బంగారు గాజు తగ్గడంతో విషయం వెలుగు చూసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేసిన బ్యాంకు అధికారులు సుమారు 5 వేల మంది ఖాతాదారుల్లో 9 మందికి చెందిన వస్తువులు ఒక్కొక్కటి తగ్గినట్లు తేల్చారు. వారం రోజుల సమగ్ర విచారణ తర్వాత బ్యాంకు మేనేజర్ ఎం వెంకట్రావ్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆ ఇద్దరిలో ఒకరు..

పది రోజుల క్రితం బ్యాంక్ మేనేజర్, ఉప మేనేజర్ సెలవుపై వెళ్లారు. ఆ సమయంలో బ్యాంకులో బాధ్యత ఉన్న అధికారులు ఐదుగురు ఉన్నట్లు తెలిసింది. అందులో ఇద్దరు అధికారులు మాత్రమే గోల్డ్ లోన్‌లకు సంబంధించిన లావాదేవీల వ్యవహారం చూశారు. బ్యాంక్ మేనేజర్, ఉప మేనేజర్‌లు సెలవులో ఉన్న సమయంలో సీసీ కెమెరా ఫుటేజీలను తొలగించి బ్యాంక్ సిబ్బందిలో ఒకరు చేతివాటం చూపించినట్లు విచారణ అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కొన్ని రోజుల సీసీ ఫుటేజీ వీడియో సైతం మాయం చేశారు. దీంతో బ్యాంకు సిబ్బంది పాత్రపైనే అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోప్యంగా విచారణ..

యూనియన్ బ్యాంకులో ఎంత మేర బంగారు ఆభరణాలు అపహరణకు గురైయ్యాయి, ఆ చోరీకి పాల్పడింది ఎవరనే దానిపై బ్యాంకు అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు. అయితే వేలాది మంది ఖాతాదారులకు సంబంధించిన విషయం కావడంతో లోతుగా ఆడిట్ చేస్తున్నట్లు తెలిసింది. మంగళవారం కూడా ఒంగోలుకు చెందిన డీజీఎం, ఏజీఎంలు ఆడిట్ నిర్వహించినట్లు సమాచారం.

మా నగలు భద్రమేనా..?

పలువురు బంగారు రుణాల ఖాతాదారులు మంగళవారం బ్యాంకు వద్దకు వచ్చి తాము లోన్‌కు పెట్టుకున్న బంగారు వస్తువులు ఉన్నాయా లేదా అనే దానిపై ఆరా తీస్తూ కన్పించారు. బ్యాంక్ అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకొని పూర్తిగా నిర్ధారణ చేసుకుని వెళ్తున్నారు.

సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: సౌర విద్యుత్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా అధికారులకు సూచించారు. జిల్లాలో పీఎం సూర్య ఘర్‌మఫ్త్ బిజిలీ యోజన అమలుపై మంగళవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ పథకం ఉద్దేశం, లక్ష్యాలు, గృహాలు, కార్యాలయాలు పరిశ్రమల్లో సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసే విధానంతో పాటు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అనుసరించాల్సిన విధానాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సౌర వ్యవస్థ ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వం అందచేసే సబ్సిడీ గురించి ప్రజలకు సమగ్రంగా తెలియచేయాలని కలెక్టర్ సూచించారు. ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మన జిల్లాలో టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం, తాళ్లూరు మండలం తూర్పుగంగవరం, పామూరు మండలం కంబాలదిన్నె, మార్కాపురం మండలం వేములకోట, జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామాలను ఈ పథకం కింద మోడల్ గ్రామాలుగా ఎంపిక చేసినట్లు కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన కలెక్టర్ ఆయా గ్రామాల్లో సత్వరమే సౌర విద్యుత వ్యవస్థను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలపై వాటిని ఏర్పాటు చేయాలన్నారు. అగ్రికల్చర్ ఫీడర్స్, మిక్సడ్ ఫీడర్స్‌లో సౌర విద్యుత్ పథకాన్ని వేగంగా అమల్లోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు సబ్సిడీ త్వరగా జమయ్యేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో ఎల్‌డీఎం రమేష్, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, జెడ్పీ సీఈఓ మాధురి, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, విద్యుత్ శాఖ అధికారులు, సోలార్ పవర్‌సిస్టం వండర్‌లు పాల్గొన్నారు.

ఒంగోలులో శిలాఫలకం ధ్వంసం



మామిడిపాలెం చెరువు ఓపెన్ జిమ్ వద్ద దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకం

ఒంగోలు టౌన్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేయడం ఇప్పటికీ ఆగలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి విధ్వంసం సాగుతున్నా అధికారులు, పోలీసులు మౌనం పాటించడంతో టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. తాజాగా నగరంలోని మామిడిపాలెం చెరువు వద్ద అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ నిధులతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దాని ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగర పాలక సంస్థ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితులను శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే డేవిడ్‌రాజుకు అంతిమ వీడ్కోలు

● పాల్గొన్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



డేవిడ్‌రాజు అంతిమయాత్రలో భౌతికకాయాన్ని మోస్తున్న మంద కృష్ణ మాదిగ

నాగులుప్పలపాడు: సీనియర్ రాజకీయ నాయకుడు మాజీ జెడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు అనారోగ్యంతో గత ఆదివారం మృతి చెందగా..మంగళవారం నాగులుప్పలపాడు మండలం మట్టిగుంటలో నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొని డేవిడ్ రాజు భౌతికకాయాన్ని మోశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం పాల్గొని నివాళులర్పించి కుమారుడు విజేష్‌రాజును కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పిల్లి మాణిక్యరావు నివాళులర్పించారు.



డేవిడ్‌రాజు సమాధి కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్, కరణం బలరాం

यूनियन बैंक Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సిఎస్ఆర్ శర్మ కాలేజ్ బ్రాంచ్, దేవుడు చెరువు, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర-523001.
ఫోన్ : 99660 00584. ఇ-మెయిల్ : ubin0811475@unionbankofinida.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ 30 రోజుల ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

వీరి నుండి
చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిఎస్ఆర్ శర్మ కాలేజ్ బ్రాంచ్, ఒంగోలు తరఫున
SARFAESI యాక్ట్ 54 ఆఫ్ 2002 క్రింద
దిగువ వారికి

విషయము : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెల్లించవలసిన బకాయి మొత్తము రాబట్టుటకు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మీకు చెందిన ఆస్తిని విక్రయించుట

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సెక్యూర్డ్ క్రెడిటార్ మీరు బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం దిగువ తెలిపిన తేదీలలో డిమాండ్ నోటీసును జారీ చేసినారు. నిర్దేశించిన సమయంలో, నిర్ణీత వ్యవధిలో మీరు నోటీసులో పేర్కొన్న బకాయిని చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6 / 8తో చదివే చట్టంలోని సెక్షన్ 13(4) ప్రకారం స్థిరాస్తులను దిగువ తెలిపిన తేదీలలో లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. కావున ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులను విక్రయించడం కొరకు ఇ-వేలం నిర్వహించాల్సిన సర్వీస్ ప్రొవైడర్ వివరాలు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, మీరు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు బ్యాంక్‌కు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకం పై తదుపరి చర్యలు తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ ఆస్తిని విడిపించుకోవచ్చు.

ఋణగ్రహీతలు/ సహ-హామీదారులు/ హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

1)	ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-హామీదారు(లు) : 1) శ్రీ దండె సురేంద్ర, తండ్రి. కృష్ణ, డి.నెం.2-1-192, మూడు విగ్రహాలు దగ్గర, గద్దలగుంట, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. 2) శ్రీమతి దండె శ్రీదేవి, భర్త. సురేంద్ర, డి.నెం.2-1-192, మూడు విగ్రహాలు దగ్గర, గద్దలగుంట, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. డిమాండ్ నోటీసు తేది : 05.04.2021 స్వాధీనత తేది : 18.09.2021 స్థిరాస్తి వివరములు : ప్రకాశం జిల్లా, ఒంగోలు, గద్దలగుంట, డి.నెం.2-1-297, బ్లాక్ నెం.12, వార్డు నెం.1, సర్వే నెం.638 వద్ద గల విస్తీర్ణం 104.88 చ॥గజాలులోని ప్లింత్ ఏరియా 700 చ॥అ॥లుతో భూమి మరియు భవనం శ్రీ దండె సురేంద్ర గారికి చెందినది. హద్దులు : తూర్పు : 15 అ॥ల రోడ్డు, పడమర : తోట కోటయ్య గారి ఇల్లు, ఉత్తరం : ఒగిరాల లక్ష్మమ్మ గారి ఆస్తి, దక్షిణం : దండె అంకబాబు గారి ఆస్తి. (దస్తావేజు నెం.3377/2016, తేది.04.05.2006) లాటిట్యూడ్ : 15.50068, లాంగిట్యూడ్ : 80.03420)
2)	ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-హామీదారు(లు) : 1) మెస్సర్స్ కరుణశ్రీ సైంటిఫిక్ & కెమికల్స్ కో., ప్రొప్రయిటర్ : శ్రీ బుర్లి రమేష్ బాబు, షాప్ నెం.7, రత్నం గోల్డెన్ టవర్స్, నార్త్ బైపాస్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. 2) శ్రీ బుర్లి రమేష్ బాబు, తండ్రి. సుబ్బయ్య, ఇంటి నెం.10-65, పమిడిపాడు గ్రామం, కొరిసెపాడు మండలం, ప్రకాశం జిల్లా-523213. 3) శ్రీ ముసికిపూడి వెంకటేశ్వర్లు, తండ్రి. చంద్రయ్య, ఇంటి నెం.6-69, రాచపూడి గ్రామం, కొరిసెపాడు మండలం, ప్రకాశం జిల్లా-523286. డిమాండ్ నోటీసు తేది : 05.04.2021 స్వాధీనత తేది : 18.09.2021 స్థిరాస్తి వివరములు : ప్రకాశం జిల్లా, ఒంగోలు, శ్రీ నగర్, నార్త్ బైపాస్ రోడ్డు, రత్నం గోల్డెన్ టవర్స్, డి.నెం.6-27(38) ఓఆర్ఎస్ నెం.లు.389/1బి1, 389/1బి2 వద్ద గల విస్తీర్ణం 26.66 చ॥గ॥లులోని అర్బన్ ఆస్తి - స్థలం & షాప్ (కమర్షియల్ కాంప్లెక్స్‌లోని షాప్) శ్రీ బుర్లి రమేష్ బాబు, తండ్రి. సుబ్బయ్య గారికి చెందినది. హద్దులు : ఉత్తరం : బాల్కనీ కొరకు 4' వెడల్పు దారి, దక్షిణం : పెనుబోతు కమలాకర్ గారికి అమ్మిన ఆస్తి, తూర్పు : ఎన్‌హెచ్-5 సర్వీస్ రోడ్డు, పడమర : గట్టిబోయిన నరసింహారావు గారి స్థలం. (దస్తావేజు నెం.726/2016, తేది.29.01.2016) లాటిట్యూడ్ : 15.51787, లాంగిట్యూడ్ : 80.03884)
3)	ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ-హామీదారు(లు) : 1) శ్రీ మరక వెంకట సూర్యనారాయణ రాజా, తండ్రి. సోమయ్య, డి.నెం.48-1-108/3, మరాటి పాలెం దగ్గర, బందర్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. 2) శ్రీమతి మరక సులోచన, భర్త. వెంకట సూర్యనారాయణ రాజా, డి.నెం.48-1-108/3, మరాటి పాలెం దగ్గర, బందర్ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523001. డిమాండ్ నోటీసు తేది : 05.04.2021 స్వాధీనత తేది : 18.09.2021 స్థిరాస్తి వివరములు : ప్రకాశం జిల్లా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్, బందర్ రోడ్డు, డి.నెం.50-1-59, 50-1-60 దగ్గర, 7వ బ్లాక్, 6వ వార్డు, టి.ఎస్.నెం.413 వద్ద గల విస్తీర్ణం164 చ॥గ॥లులోని అర్బన్ ఖాళీ భూమి శ్రీమతి మరక సులోచన గారికి చెందినది. హద్దులు : తూర్పు : ఇప్పంశెట్టి శ్రీనివాసులు, వెంకటరావు, సూర్యనారాయణ మరియు ఇతరులు యొక్క ఇల్లు, దక్షిణం : అనంత మల్లికార్జున రావు గారి ఇల్లు, పడమర : రాజవీధి కొంతవరకు మరియు కునపరెడ్డి అంజయ్య గారి ఇంటి యొక్క హద్దు గోడ, దక్షిణం : కునపరెడ్డి అంజయ్య గారిచే ఇతరులకు అమ్మిన స్థలం. (దస్తావేజు నెం.2991/2004, తేది.19.06.2004) లాటిట్యూడ్ : 15.50241, లాంగిట్యూడ్ : 80.05273

తేది : 08.08.2024, స్థలం ఒంగోలు సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

● ఎస్పీ దామోదర్



ఉచిత వైద్య శిబిరంలో ప్రసంగిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: కుటుంబంలోని మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని, మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపెట్టాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీసు కళ్యాణ మండపంలో నగరంలోని వివిధ వైద్యశాలల సహకారంతో పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ఎక్కువగా ప్రజా భద్రతకే ప్రాధాన్యం ఇస్తుంటారని, వృత్తి నిర్వహణతో పాటుగా ఆరోగ్యంపై కూడా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. పోలీసు కుటుంబసభ్యులు ఎలాంటి అనారోగ్య సమస్య కనిపించినా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకొని తగిన చికిత్స తీసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళా సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, గైనకాలజీ, కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, డెర్మటాలజీ ఆప్తమాలజీ, పీడియాట్రిక్, సుగర్, థైరాయిడ్, న్యూరో, జనరల్ సర్జరీ వైద్య నిపుణులు వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా శ్రీరాం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వెంకటరమణ హాస్పిటల్, ఆస్టర్ రమేష్ వైద్యశాలలు పోలీసులకు పలు రాయితీలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ప్రసాద్ హాస్పిటల్ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మహిళలకు వచ్చే గర్భాశయ క్యాన్సర్, సెర్వికల్ క్యాన్సర్, ఇతర క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రతల గురించి డాక్టర్ ప్రతిమా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్ర, తాలుకా సీఐ అజయ్‌కుమార్, యూనిట్ వైద్యురాలు డాక్టర్ భానుమతి, వివిధ వైద్యశాలలకు చెందిన వైద్యులు, సిబ్బంది, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపై కొడుకులు, కోడళ్లు దాడి

కురిచేడు: ఆస్తి కోసం కన్నతల్లిని కొట్టి గాయపరిచిన కుమారులు, కోడళ్లపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌ఓ ఎం శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నల్లబోతుల బంగారమ్మకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహాలు కాగా వేర్వేరు కాపురాలు పెట్టుకొని జీవిస్తున్నారు. ఏడాది క్రితం బంగారమ్మ భర్త మృతిచెందాడు. అందరికీ ఆస్తి పంపిణీ చేసి తాను విడిగా జీవనం సాగిస్తోంది. అయితే కుమారుల్లో రామకోటయ్య, కోటేశ్వరరావు అప్పుల పాలయ్యారు. దీంతో సోమవారం భార్యలతో కలిసి తల్లి నివాసం ఉండే ఇంటికి వచ్చారు. తాము ఇంట్లో ఉంటామని, ఇంట్లో నుంచి వెళ్లిపోవాలన్నారు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో కొట్టి గాయపరిచారు. బంగారమ్మకు తలకు రక్త గాయాలయ్యాయి. దీంతో 108 వాహనంలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం తో పాటు త్రిపురాంతకం సీఐ సూరేపల్లి సుబ్బారావు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు తెలిపారు.

నవ వధువు ఆత్మహత్య?

కనిగిరి రూరల్: నవ వధువు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామం బీసీ కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు గత శుక్రవారం పునుగోడు గ్రామానికి చెందిన నర్సింహకు, శిరీషా అనే యువతితో వివాహమైంది. అయితే పుట్టింట్లో ఉన్న నవ వధువు మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి స్వల్ప వ్యవధిలోనే దహన సంస్కారాలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై టి.త్యాగరాజును వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని, సమాచారం తెలియడంతో విచారిస్తున్నామని చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్



అద్దెకు ఇవ్వబడును

■ ఒంగోలు, మంగమూరురోడ్, HP గ్యాస్ ఎదురు పాత HP గ్యాస్ గోడౌన్ 1000SFT & 7,400SFT ఖాళీ స్థలము కలిపిమొత్తం 8,400 SFT అద్దెకు లీజుకు ఇవ్వబడును. ట్రాన్స్‌పోర్టుకు అనువైనది. ✆ 99636 37164 [OA-297]

■ ఒంగోలు, సంతపేట, TTD కళ్యాణ మండపం దగ్గర SC హాస్టల్ ఎదురు శ్రీరామ అపార్ట్‌మెంట్‌లో 2nd ఫ్లోర్, 2400 SFT ఫ్లాట్ అద్దెకు ఇవ్వబడును. ✆ 99636 37164 [OA-298]



■ A1 పెస్ట్ కంట్రోల్‌కు 20సం॥వయసు గల 10th/ ఇంటర్ P/F యువకులు కావలెను. మంచి జీతం+రూమ్+మీల్స్‌ఫ్రీ. వివరాలకు సంప్ర॥ ✆ 84648 63989, 76618 13989. [O-190021]

■ ప్రముఖ 2 వీలర్ ఫైనాన్స్ కంపెనీలో ఒంగోలు మరియు సబ్ బ్రాంచ్‌ల నందు పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్, Q: ఏదైనా డిగ్రీ. Age : 32 లోపు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, కలెక్షన్ ఏజెంట్స్ (DRA సర్టిఫికెట్ కలవారికి ప్రాధాన్యత) Q: 10th ఆపైన వివరాలకు సంప్ర॥ ✆ 70329 87266 [O-190020]

■ బిజినెస్ ప్రమోటర్స్, టెలికాలర్స్, PRO's, గ్రాఫిక్ డిజైనర్, స్టాఫ్ కావలెను. (P/F టైం / వర్క్ ఫ్రమ్ హోమ్) Apdigita-ltech. ఫోన్: 6309894919, 6309287099 [H-783065]

■ Wanted Teachers for 1st to 5th Classes at DEEPSIKA PUBLIC SCHOOL KAKARLA Hostel Facility Available ✆ 63038 12204, 95054 08970. [O-793813]

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02762

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.